

# కథా కౌముది

## ఇజాలు – నిజాలు

డా.కొండపల్లి రామారావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

ఏవో ఆలోచనలతో కళ్ళు మూసుకొని కూర్చుని ఉన్న డాక్టర్ వివేక్, ఒక్క కుదుపుతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు.

గడియారం చూసుకున్నాడు. సమయం తెల్లవారుజామున నాలుగు గంటలు.

విమానంలో ఓ చిన్న అలజడి మొదలయ్యేసరికి కిటికీలోంచి క్రిందికి చూశాడు. పలుచటి మబ్బుల్ని చీలుస్తూ, చిన్న చిన్న కుదుపులతో అప్పుడే క్రిందికి దిగటం మొదలైన విమానం లోంచి కాంతులీనుతూ కనిపించింది భాగ్యనగరం.

ఒక్కసారిగా ఉద్వేగ భరితమైంది అతని మనసు. సుమారు అయిదేళ్ల తర్వాత తను స్వదేశం, అందునా సొంత ఊరు, తిరిగి వస్తున్నాడు.

నెమ్మదిగా కొంచెం కొంచెం క్రిందికి దిగుతున్న విమానంలోంచి బయటకు చూస్తున్న డాక్టర్ వివేక్ కు మళ్ళీ అంతకుమునుపు తను ఆలోచిస్తున్న విషయం గుర్తుకు వచ్చి మనసు బరువెక్కింది.

'తను ఈ అయిదేళ్లూ అక్కడ పనిలో పడి ఈ విషయం గురించి ఎక్కువగా ఆలోచించలేదు. ఇప్పుడు స్వదేశం తిరిగి వస్తూ ఉండగానే 'ఆ విషయం' గుర్తుకు వచ్చింది. అయిదేళ్ల క్రితం తను చేసిన పని తప్పో ఒప్పో ఇప్పుడు తెలుస్తుంది. అది తప్పైతే... అమ్మో!' ఆ ఆలోచనే భరించలేకపోయాడు వివేక్.

'అయినా ఇంకా కొన్ని గంటల్లో ఏ విషయమూ తెలుస్తుంది. ఇప్పుడు ఎంత ఆలోచించినా లాభం లేదు. తను చేసిన పని ఒప్పే అయితే తన కన్నా ఎక్కువగా సంతోషించే వారు ఎవరూ లేరు. కానీ తప్పయితే... తను జీవితాంతం ఆ బాధను అనుభవిస్తూ బ్రతకాల్సిందే!' భారంగా నిట్టూర్చాడు వివేక్.

'అంకిత, పిల్లలు ఎట్లా ఉన్నారో! ఇంకా ఎర్రమంజిల్ కాలనీలో అదే బిల్డింగులో ఉంటున్నారని తెలిసింది. వాళ్లు ఏ పరిస్థితిలో ఉన్నారో!? తను ధైర్యంగా ఆమె ముఖంలోకి చూడగలడా? ఆమెతో ఇదివరకు లాగా మాట్లాడగలడా? తను ఆశించిన విధంగా వాళ్ళు లేకపోతే మాత్రం...', కణతలు నొక్కుకున్నాడు వివేక్.

ఆలోచనల్లోనే కస్టమ్స్ ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని ఎయిర్ పోర్టు బయటికి వచ్చాడు వివేక్.

★ ★ ★

అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు ఎర్రమంజిల్ కాలనీ లోని అంకిత వాళ్ళ ఫ్లాట్ ముందు ఉన్నాడు డాక్టర్ వివేక్.

ఒక్క క్షణం ఆగి, ఊపిరి పీల్చుకొని కాలింగ్ బెల్ నొక్కాడు.

'జై జగదీశ్ హరే' పాట వినిపించింది లోపలి నుంచి.

ఓ అర నిమిషం తరువాత తలుపు తెరిచి 'ఎవరు?' అన్నట్లు చూస్తున్న సుమారు 12 ఏళ్ళ వయసున్న పిల్లవాడిని గుర్తుపట్టాడు వివేక్.

చిన్నగా నవ్వుతూ "అక్షంత్!?" అన్నాడు.

"యా! మీరు..." అంటూ ఆగాడు అక్షంత్.

కాలింగ్ బెల్ చప్పుడు విని, వంటింట్లో చేస్తున్న పని ఆపు చేసి చీర కొంగుతో చేతులు తుడుచుకుంటూ అప్పుడే అక్కడికి వచ్చిన అంకిత, వివేక్ ను చూడగానే ఆనందాశ్చర్యాలతో గబగబా నాలుగు అడుగులు ముందుకు వేసింది, "వివేక్!" అంటూ.

'తల్లికి తెలిసిన మనిష'ని తెలియడంతో, పక్కకు తప్పుకొని వివేక్ కు దారి ఇచ్చాడు అక్షంత్.

"వివేక్, రా!రా! నీవు ఫారిన్ వెళ్ళిన తర్వాత నీ దగ్గరనుంచి వార్తలేమీ లేవు. ఎప్పుడొచ్చావు? ఎట్లా ఉన్నావు?" గబగబా అడిగింది అంకిత.

"ఈ ఉదయమే వచ్చాను. నేను బాగానే ఉన్నాను. అక్కడ పనిలో పడి ఎవరితో కాంటాక్ట్ పెట్టుకోలేదు. నీవూ, పిల్లలు ఎట్లా ఉన్నారు అంకితా?", చుట్టూ పరికిస్తూ నవ్వు ముఖంతో లోపలికి ప్రవేశించాడు వివేక్.

'వాళ్ల గురించి తను ఏం వినాల్సి వస్తుందోనన్న భయంతోనే తను ఎవరితోనూ కాంటాక్ట్ పెట్టుకోలేద'న్న విషయం వివేక్ కు మాత్రమే తెలుసు.

"రా, కూర్చో, వివేక్! మేము బాగానే ఉన్నాము... ఏరా, అక్షంత్! ఎవరో గుర్తుపట్టలేదా?" అడిగింది అంకిత కొడుకు వైపు తిరిగి.

"అంటే.. అమ్మా! మొదలు గుర్తుపట్టలేదు. ఇప్పుడు గుర్తుకు వచ్చారు", చిన్నగా నసిగాడు అక్షంత్.

"చూసి అయిదేళ్లయింది కదా! ఈ వయసు పిల్లలకు, ఎవరినైనా అన్ని రోజులు చూడకపోతే మరిచిపోవడం సహజం", నవ్వుతూ ఉంటూ సోఫా లో కూర్చున్నాడు వివేక్.

ఫ్లాట్ అంతా పరిశీలనగా చూశాడు వివేక్. హాలు చిన్నదైనా దానికి తగ్గ సైజులో ఓ సోఫా సెట్టు, దానికి ఎదురుగా ఓ ఎల్ఈడి టీవీ, ఓ మూల రాక్ లో పుస్తకాలు, ప్రక్కనే చిన్న గ్రానైట్ టేబుల్ మీద ఓ రెండు ఇంగ్లీష్ నవలలు, న్యూస్ పేపర్ – అందంగా పొందికగా అమర్చి ఉన్నాయి.

"ఎట్లా ఉన్నారు అంకితా? పిల్లలు ఏం చదువుతున్నారు?" అంకిత వైపు చూడటానికి సందేహిస్తూ అక్షంత్ వైపు చూస్తూ అడిగాడు వివేక్.

"మేము బాగానే ఉన్నాము వివేక్! అక్షర మంచిర్యాంకుతో ఎంట్రన్స్ టెస్ట్ పాస్ అయింది. వరంగల్ ఎన్ఐటి లో బీటెక్ లో చేరింది. అక్షంత్ ఇక్కడే ఓ మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నాడు. ఐఐటీకి కోచింగ్ తీసుకుంటున్నాడు. ఇద్దరూ బాగానే చదువుకుంటున్నారు. వాళ్ళ వాళ్ళ క్లాసుల్లో టాప్ లో ఉన్నారు."

అప్పుడు అంకిత వైపు చూపు త్రిప్పాడు వివేక్.

పిల్లల విషయాలు చెబుతున్నప్పుడు అంకిత ముఖం వెలిగిపోయింది.

"నీవు, నీ ఉద్యోగం...", మధ్యలోనే ఆగాడు వివేక్. "ఉద్యోగానికి బాగానే అలవాటు పడ్డాను, వివేక్! వెళ్లి రావడం కూడా అంత కష్టమనిపించడం లేదు. ఆఫీసులో కూడా అందరూ బాగానే సహకరిస్తున్నారు." తనూ వేరే సోఫాలో కూర్చుంటూ అంది అంకిత.

"నేను చదువులోనే కాక మిగతా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటాను. మా స్కూల్ కల్చరల్ కమిటీకి సెక్రెటరీని నేను." వివేక్ ని గుర్తుపట్టిన చనువుతో గర్వంగా అంటున్న అక్షంత్ వైపు ప్రేమగా చూసింది అంకిత.

"వెరీ గుడ్! మరి అక్క..." అంటున్న వివేక్, "హాయ్!" అంటూ అప్పుడే గదిలోంచి బయటికి వచ్చిన అక్షర వైపు చూశాడు.

"ఎట్లా ఉన్నారు, అంకుల్! ఎప్పుడొచ్చారు?" అంటూ చనువుగా అతను కూర్చున్న సోఫాలోనే కూర్చుంటూ అడిగింది అక్షర.

"నేను బాగున్నానమ్మా! అయితే నన్ను గుర్తుపట్టావన్నమాట. ఎట్లా ఉంది నీ చదువు?" ఆప్యాయంగా ఆ అమ్మాయిని పలకరించాడు వివేక్.

"అయ్యో, మిమ్మల్ని గుర్తు పట్టక పోవడమేమిటి? నా చదువు, కాలేజీ అన్ని బాగున్నాయి. వరంగల్ ఎన్ఐటిలో బీటెక్ కంప్యూటర్ సైన్సు లో చేరాను. ఒక వారం సెలవులిస్తే నిన్ననే ఇక్కడికి వచ్చాను. బీటెక్ తర్వాత ట్రిపుల్ ఐటీ హైదరాబాదులో ఎంటెక్ చేయాలనుంది." ఉత్సాహంగా తన ప్లాన్స్ చెప్పింది అక్షర.

"వెరీ గుడ్! నీవూ, తమ్ముడూ ఇంత బాగా వృద్ధి లోకి వచ్చినందుకు చాలా సంతోషం...", మాటలు ఆపి అంకితవైపు అర్థవంతంగా చూశాడు వివేక్.

అతని భావాన్ని అర్థం చేసుకున్న అంకిత, అక్షర వైపు చూసి,"తమ్ముడూ, నీవూ లోపలికి వెళ్లి, వాడు రేపు పాల్గొనబోయే  వక్తృత్వపోటీకి వాడికి సహాయం చెయ్యమ్మా అక్షరా!" అంది.

పదిహేడేళ్ళ అక్షర వెంటనే తెలుసుకుంది, వాళ్ళిద్దరూ ఒంటరిగా మాట్లాడుకోవాలనుకుంటున్నారని.

"రారా, అక్షంత్!" అని తమ్ముడిని పిలుస్తూ లోపలికి వెళ్ళిపోయింది అక్షర. ఆమెను అనుసరించాడు అక్షంత్.

ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్న ఆ అక్కా తమ్ముళ్ళను సంతృప్తిగా చూశాడు వివేక్.

"వేరే సమస్య లేమీ లేవుగా అంకితా?" ప్రశ్నార్థకంగా అంకిత ముఖం లోకి తరచి చూస్తూ అడిగాడు వివేక్.

మరుక్షణంలో అంకిత ముఖంలో బాధ కనిపించింది. గబుక్కున తలవంచేసుకుని కళ్ళు రెండూ వత్తుకుంది.

"లేదు వివేక్! ఏ సమస్యా లేదు, ఆనంద్ మా మధ్య లేడు అన్న బాధ తప్ప", అంటుంటే ఆమె గొంతు బొంగురు పోయింది.

"జరిగిపోయిన దానికి మనమేం చేయగలం అంకితా! ఆనంద్ కు అట్లా వ్రాసిపెట్టి ఉంది. లేకపోతే అంత చిన్న వయసులో ఆ ఘోరం ఏమిటి?!" స్నేహితుడి భార్య వైపు సానుభూతిగా చూస్తూ, నెమ్మదిగా మాటలు కూడదీసుకుంటూ అన్నాడు వివేక్.

"ఎంతమందికి ఎన్ని ఆరోగ్య సమస్యలు రావడం లేదు! నయం కావడానికి ఏమాత్రం వీలుకాని జబ్బు తనకు రావటమేమిటి! నాలుగు పదుల వయసు కూడా రాకుండా ఆనంద్ కు కాలం తీరటమేమిటి! అంతా నా దురదృష్టం." అంకిత కళ్ళు నీళ్లతో నిండిపోయాయి.

"అది నిజంగా మన దురదృష్టమే. ఎప్పుడూ ఎటువంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యా లేని వాడికి అట్లా కావడం ఆశ్చర్యమే మరి." వివేక్ అన్నాడు.

"పైగా అంత హఠాత్తుగా ముంచుకు రావటమేమిటో! రోగం గుర్తించిన రెండు వారాల్లోనే ఆయన పోవటమేమిటో! అంతా ఒక పీడకల లాగా జరిగిపోయింది." అంకిత కళ్ళు ఎర్రబడ్డాయి.

"మనం చేయగలిగింది మనం చేశాం అంకితా! వాడు ఇంకా కొన్ని రోజులు బ్రతికి ఉన్నా, శరీర కష్టం తప్ప మరింకేమీ ఉండకపోయేది. అది మనం చూడలేం గదా! ఏది జరిగినా మన మంచికే అనుకొని ముందుకు సాగాలి." అనునయంగా అన్నాడు వివేక్.

అంకిత యింక మాట్లాడలేకపోయింది. కళ్ళు తుడుచుకుంటూ ఎటో శూన్యం లోకి చూస్తూ కూర్చుండిపోయింది

"కానీ అంకితా! జరిగిన దాన్ని మనం ఆపలేకపోయినా ప్రస్తుతం జరుగుతున్నది మాత్రం, నాకు ఒక విధమైన తృప్తినిస్తున్నది. నీవూ, నీ పిల్లలూ..." అర్థోక్తిలో ఆగాడు వివేక్.

వెనువెంటనే అంకిత ముఖం లో మార్పు కనిపించింది. "నీవనేది నిజమే వివేక్! ఆనంద్ కూడా ఎప్పుడూ అంటుండేవాడు 'యద్గతం తద్గతం గతం' అని. 'జరిగిపోయిన దాని గురించి ఎప్పుడూ విచారపడకూడద'నేవాడు. అయిందేదో అయింది, ఆనంద్ పోతూ పోతూ మాకు ఓ దారి ఏర్పరచి పోయాడు. నాకు ఆయన ఆఫీసులో ఉద్యోగం రావటమే కాక పిల్లలిద్దరూ బాగా చదువుకుంటున్నారు. నాన్నగారు ఇచ్చిన ఇండ్లస్థలాన్ని అప్పుడు అమ్మ లేకపోయాం కదా! దాన్ని లీజ్ కి ఇచ్చాము. ఈ ఫ్లాట్ కూడా సొంతమే కాబట్టి ఏ సమస్యా లేదు. అంతా సవ్యంగా జరిగిపోతున్నది." కళ్ళు తుడుచుకుంటూ తలపైకెత్తి అంది అంకిత. ఎంతో ఆత్మస్థైర్యం కనిపించింది ఆమె మాటల్లో.

"నీవూ, పిల్లలూ సంతోషంగానే ... అంటే... అదే ఆనందంగానే ఉన్నారు గదా!" మరొక్కమారు అడిగాడు వివేక్.

కళ్ళెత్తి విశ్వాసం తొణికిసలాడే కళ్ళతో చూసింది అంకిత. "అవును వివేక్! మేము చాలా బాగా ఉన్నాము. ఇక మాకేమవుతుందో అనే బెంగ నాకేమాత్రం లేదు. చేతిలో ఉద్యోగం, ఉండడానికో ఫ్లాటు, ముత్యాల్లాంటి పిల్లలు – ఏ సమస్యా లేదు." వివేక్ కు భరోసా ఇచ్చింది అంకిత.

గుండెల మీద నుంచి ఒక పెద్ద భారం దిగిపోయినట్లు అనిపించింది వివేక్ కు.

"చాలా సంతోషం అంకితా! నిన్నూ, పిల్లల్నీ యీ విధంగా చూస్తుంటే చాలా ఆనందం కలుగుతున్నది. నీకు ఏ కష్టమొచ్చినా నేనున్నానన్న మాట మాత్రం మరవకు. సరేనా?" ఆమె వైపు అభిమానంగా చూస్తూ అన్నాడు వివేక్.

"తప్పకుండా వివేక్! నీకంటే దగ్గర వాళ్ళు మాకింకెవరున్నారు? ఆఁ, అది సరేగానీ, ఈ రాత్రికి నీవు మా ఇంట్లోనే డిన్నర్ చేయాలి. ప్రస్తుతం ఓ కప్పు కాఫీ త్రాగుదువుగాని, సరేనా?" అంటూ లేచింది అంకిత.

"డిన్నర్ అదీ ఈరోజు వద్దు అంకితా! ఇంకా జెట్ ల్యాగ్ పోలేదు. ఇక్కడే ఉంటాను గా, మళ్ళీ ఇంకో రోజు వస్తాను డిన్నర్ కి. ప్రస్తుతానికి ఒక్క కాఫీ చాలు." సున్నితంగా వారించాడు వివేక్.

"సరే, నీ ఇష్టం. కానీ వీలు చూసుకుని తీరిగ్గా మళ్ళీ రావాలి. డిన్నర్ చేస్తూ నీ అయిదేళ్ళ అమెరికా అనుభవాలు వినాలని ఉంది. కాఫీ తెస్తాను... అక్షరా!" అని పిలుస్తూ లోపలికి వెళ్ళింది అంకిత.

అంతవరకూ ఎంతో టెన్షన్ తో ఉన్న వివేక్ ఒక్కసారిగా తేలికైన మనసుతో సోఫాలో వెనక్కు అనుకొని కూర్చొని దీర్ఘంగా నిట్టూర్చాడు.

★ ★ ★

అంకిత, పిల్లలను కలిసి తేలిక పడ్డ మనసుతో వెనుదిరిగిన వివేక్ కు గతం ఓ సినిమా రీలులా కళ్ళ ముందు కదిలింది.

వివేక్, ఆనంద్, అంకిత – ముగ్గురూ చిన్ననాటి స్నేహితులు. పక్కపక్క ఇళ్ళు, సుమారుగా ఒకే వయసు, ఒకటే తరగతి కావడం వల్ల వాళ్ళ మధ్య స్నేహం చిన్ననాడే బాగా బలపడింది. వివేక్, ఆనంద్ లను కలిపి 'వివేకానందులు' అని స్నేహితులు పిలవడం చాలా సాధారణ విషయం అయింది. ఇద్దరూ ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుతూ, అన్ని విషయాలూ చర్చించుకుంటుండేవారు. వక్తృత్వ పోటీలు అంటే ఇద్దరికి చాలా ఇష్టం. స్కూల్లో జరిగే వక్తృత్వ పోటీల్లో ఒకే టాపిక్ మీద భిన్న అభిప్రాయాలతో మాట్లాడుతూ ఇద్దరూ ఎన్నోసార్లు పోటీపడ్డారు. అయితే ఆ పోటీ ఆ టాపిక్ వరకే, ఆ చర్చ వరకే. తరువాత ఇద్దరూ మళ్ళీ ఎప్పటిలా కలిసిపోయేవారు.

పదవ తరగతి తరువాత ఎవరికి ఆసక్తి ఉన్న మార్గం వారు ఎన్నుకున్నందువల్ల కాలేజీలు, చదువులు అన్నీ వేరైనా, వాళ్ళ స్నేహం మాత్రం మునపటిలాగే కొనసాగింది. ఇంటర్లో బైపిసి తీసుకొని ఎంబిబిఎస్ చేసి వైద్య వృత్తిలో స్థిరపడ్డాడు వివేక్. సైన్స్ లో డిగ్రీ తీసుకొని రకరకాల పోటీ పరీక్షలు వ్రాసి 21 ఏళ్ళు నిండేసరికే ఓ గవర్నమెంట్ జాబ్ సంపాదించుకున్నాడు ఆనంద్. సైన్స్ లోనే డిగ్రీ తీసుకొని, తరువాత ఇంటి పరిస్థితుల వల్ల చదువు ఆపింది అంకిత.

చిన్ననాటి స్నేహం అటు తర్వాత కూడా కొనసాగడం వల్ల యుక్త వయసు వచ్చేసరికి అంకిత, ఆనంద్ ల మధ్య ప్రేమ చిగురించింది.వివేక్ సహాయంతో, పెద్దల ఆశీస్సులతో డిగ్రీ అయిపోయి ఆనంద్ కు ఉద్యోగం రాగానే అంకిత, ఆనంద్ లు ఒకటయ్యారు. ఎంబిబిఎస్, ఎండి, స్పెషలైజేషన్, ఫారిన్ ట్రిప్ అంటూ తన పెళ్లి వాయిదా వేసుకుంటూ వచ్చాడు వివేక్. అంకిత, ఆనంద్ ల పెళ్లి అయిన తర్వాత కూడా అందరూ భాగ్యనగరంలోనే నివాసం ఏర్పరచుకున్నందువల్ల వారి స్నేహం అలాగే నిరాటంకంగా కొనసాగింది.

సరిగ్గా ఇంకో నెల రోజుల్లో వివేక్ అమెరికా వెళతాడనగా ఒక రోజు రాత్రి 10 గంటలకు వివేక్ ఫోన్ మ్రోగింది. అటువైపు అంకిత.

"హలో! వివేక్! ఆనంద్ కు ఏమిటో ఒంట్లో బాగాలేదు. చాలా నీరసంగా ఉన్నాడు. నాకు భయమేస్తున్నది. ఏం చేయమంటావు?" కంగారుగా అడిగింది.

"నేను వస్తున్నాను", అంటూ ఆమె ఇంకో మాట మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసి వెంటనే బయలుదేరాడు వివేక్.

ఆనంద్ పరిస్థితి చూసిన వివేక్ నిర్ఘాంత పోయాడు. చాలా నీరసంగా కన్పించాడు ఆనంద్. మనిషి చాలా పాలిపోయి ఉన్నాడు.

"ఏమిటిది అంకితా! ఎప్పటినుంచి ఇట్లా ఉన్నాడు?" ఆదుర్దాగా అడిగాడు వివేక్.

"ఒక రెండు వారాల నుంచి నీరసమంటున్నాడు. ఏ పనీ చేయబుద్ధి కావటం లేదంటున్నాడు. ఓ రెండుసార్లు వాంతులు కూడా అయినవి. ఆకలి లేదు. ఏవో జ్యూస్ లు, కొబ్బరిబోండాలు ఇస్తే బలవంతంగా తాగాడు. 'బాగానే ఉందిలే' అంటూ ఈ రెండు వారాలూ ఆఫీసుకు కూడా వెళ్ళాడు. ఈరోజు ఆఫీసులో పనిచేయలేక సగం రోజు సెలవు పెట్టి ఇంటికి వచ్చిన తర్వాత అట్లా నీరసంగా పడుకుని నిద్రపోయాడు. ఇంతకుముందే నిద్ర లేచిన దగ్గర్నుంచీ... "

"అయ్యో, మరి నాకు ఒక్క మాటైనా చెప్పలేదేం?! నేనూ బిజీగా ఉండి మిమ్మల్ని ఈమధ్య కలవలేదు." ఆమెను మధ్యలోనే ఆపు చేస్తూ అన్నాడు వివేక్.

"నేనే వద్దన్నాను లేరా! నీరసానికి కూడా డాక్టరెందుకు? స్నేహితుడు డాక్టర్ అయినంత మాత్రాన, ప్రతి చిన్నదానికీ డాక్టర్ దగ్గరికి వెళ్తామా ఏంటి? పైగా నీవూ నీ అమెరికా ప్రయాణం హడావుడిలో ఉన్నావు." నీరసంగా నవ్వుతూ అన్నాడు ఆనంద్.

అయితే ఆనంద్ ను ఓ 5 నిమిషాలు పరీక్షించి చూసిన వివేక్ మనసు కీడును శంకించింది. "అంకితా, నీవు తయారుకా! వాడిని హాస్పిటల్ కి తీసుకువెళ్లాలి. పిల్లలను పక్కన మీ ఫ్రెండ్స్ ఎవరింట్లోనైనా ఉంచు", హడావిడిగా అంటూ స్నేహితుడి చేయి పట్టుకుని లేపాడు వివేక్.

అక్షరను,అక్షంతను తమ పక్క అపార్టమెంట్లోని ఫ్రెండ్స్ కు అప్పజెప్పి, "నీరసానికి కూడా హాస్పిటల్ ఎందుకు?" అని సణుగుతున్న ఆనంద్ ను కారులో కూర్చోబెట్టి అప్పటికప్పుడే హాస్పిటల్ కి తీసుకు వెళ్ళారు వివేక్, అంకిత.

ఆ నిమిషం నుంచీ ఆమర్నాడు సాయంత్రం వరకు చేసిన వివిధ పరీక్షల ద్వారా బయటపడింది ఓ భయంకరమైన నిజం. ఆనంద్ కు చిన్నప్పుడెప్పుడో వచ్చిన లివర్ ఎన్లార్జ్మెంట్ సమస్య తీవ్రతరమైంది. ఇప్పుడు అతని లివర్ పూర్తిగా పాడైపోయింది. లివర్ బయాప్సీ చేసి అది లివర్ క్యాన్సర్ గా నిర్ధారించారు డాక్టర్లు. 'లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేయడం – అదీ ఒక రెండువారాల్లోగా చేయడం తప్పనిసరి' అని తేల్చారు. ఆపరేషన్ కు సుమారు 50 లక్షలు అవుతుందని కూడా చెప్పారు హాస్పిటల్ లో.

విషయం విన్న వివేక్, అంకితలకు మతిపోయింది. "ఏమిటి ఈ ఘోరం వివేక్?! ఇంత వేగంగా లివర్ పాడు కావటం ఏమిటి?" వెక్కుతూ అంది అంకిత.

"వేగంగా అంటే – కొంతకాలంగా జరుగుతుండవచ్చు. ఆ లక్షణాలను చూస్తే అవి ఇంత ప్రమాదకరమైన వ్యాధికి దారితీస్తుందని ముందుగా తెలియదు. అయినా మనం భయపడనక్కర్లేదు. లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేయవచ్చు అని చెప్పారు కదా డాక్టర్లు. దానితో మళ్ళీ ఆనంద్ మాములు మనిషి అవుతాడు. భయపడకు అంకితా!" తోచిన విధంగా ధైర్యం చెప్పాడు వివేక్.

"వివేక్! ఆయన ప్రాణమే మనకు ముఖ్యం. తను కొన్న ఈ ఫ్లాట్ అమ్మేద్దాం. నాకు మా నాన్నగారు ఇచ్చిన ఇండ్ల స్థలం ఉంది. అదీ అమ్మేద్దాం. ఆస్తి ఏమి మిగలకపోయినా ఫర్వాలేదు. ఆనంద్ ఆరోగ్యంగా బయటకు రావాలి." రుద్ధకంఠంతో ఉంది అంకిత.

"ఏదో ఒకటి చేద్దాంలే అంకితా! నేను లేనా? నీవు ధైర్యంగా ఉండు." ఆమెను అనునయించాడు వివేక్.

అయితే వివేక్ మనసులో కూడా రకరకాల ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. 'ఆనంద్ కి వచ్చిన జబ్బు ఎంత ప్రమాదకరమైనదో తనకు తెలుసు. ఈ పరిస్థితుల్లో డబ్బు విషయంలో తను ఏమీ చేయలేడు. డాక్టర్ గా డబ్బు సంపాదించడం తనింకా మొదలుపెట్టలేదు. అంతేకాక, ఎన్నో ఏళ్లుగా తను కన్న కలలు సాకారం అయి అమెరికాలో ఆస్టిన్ లో బ్రేకన్ రిడ్జ్ హాస్పిటల్ లో పని చేయటానికి తనకు వచ్చిన ఈ అవకాశం తను వదులుకోలేడు. ఇక్కడే ఉండిపోయి ఆనంద్ ఆరోగ్య విషయం కనుక్కోలేడు. ఏం చేయాలి?' మధన పడసాగాడు వివేక్.

"వివేక్! నీవు నీ ప్రయాణం విషయంలో అశ్రద్ధ చేయకు. నాకు ఒక్క సాయం మాత్రం చేసి పెట్టు, చాలు. డాక్టర్ తో మాట్లాడి ఆపరేషన్ కు డేట్ ఫిక్స్ చెయ్యి. నేను ఫ్లాట్, స్థలం – అన్నీ తెగనమ్మైనా డబ్బు తెస్తాను. సరేనా?" అతని ఆలోచనల్ని పసిగట్టినట్లు అంది అంకిత.

"నా ప్రయాణం సంగతి చూసుకుంటున్నానులే అంకితా! డాక్టర్ తో మాట్లాడి ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేస్తాను. నీవు మిగతా విషయాలు చూడు." చెప్పలేక చెప్పాడు వివేక్.

అయితే అదే రోజు రాత్రి వివేక్, ఆనంద్ తో ఒంటరిగా ఉన్న సమయంలో...

"వివేక్! నా స్నేహితుడిగా కాకుండా డాక్టర్ గా నాకు ఒక నిజం చెప్తావా?" అడిగాడు ఆనంద్. "నీవేమీ అడగవద్దు, నేనేమీ చెప్పవద్దు. అంతా సవ్యంగా జరిగి నీవు ఓ రెండు వారాల్లో ఇంటికెళ్తావు. మాట్లాడకుండా పడుకోరా!" ఆప్యాయంగా కసిరాడు వివేక్.

"నీవు అట్లా కసిరి నా నోరు మూయించకు. నేను అడిగేదానికి నీవు జవాబు చెప్పక తప్పదు. నీవు నా ప్రాణ స్నేహితుడివి. మన స్నేహం సాక్ష్యంగా నీవు నిజం చెప్పాలి." దృఢంగా అన్నాడు ఆనంద్.

"ఏం కావాలి, చెప్పరా!" ఆనంద్ చేతిని తన చేతిలోకి తీసుకొని ప్రేమగా నిమురుతూ అన్నాడు వివేక్.

"నా జబ్బు గురించి నాకు కొన్ని వివరాలు కావాలి. నేను కొంత, పుస్తకాలలో చదివాననుకో. డాక్టర్ల మాటల వల్ల, వాళ్ళ ప్రవర్తన వల్ల కొంత అర్థమైంది. ఈ రోగం నాకు రావడానికి అసలు కారణం ఏమిటి? నేను బ్రతికే ఛాన్స్ ఎంత? బ్రతికినా, తరువాత నేను మామూలు మనిషిగా జీవితం గడపగలనా? నీవు ఈ ఏరియాలో స్పెషలిస్ట్ వి కాకపోయినా ఓ డాక్టర్ గా నీకు తెలిసింది చెప్పు." గంభీరంగా అన్నాడు ఆనంద్.

జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు సైన్స్ పుస్తకాలు కూడా బాగా చదివే ఆనంద్ కు పరిస్థితి తీవ్రత అర్థమైందనిపించింది వివేక్ కు.

"దీనికి 'కారణం ఇదీ' అని ఇదమిద్ధంగా చెప్పలేమురా! చిన్నప్పుడు నీకు ఉన్న లివర్ ఎన్లార్జ్ మెంట్ కొంతవరకూ కారణం కావచ్చు. వేరే ఏదైనా కావచ్చు. అయితే యిదివరకు లేని సులువు ఇప్పుడు ఉంది. ఈ కార్పొరేట్ హాస్పిటల్స్ లో డబ్బు పడేస్తే వాళ్లే లివర్ డోనర్ ను కూడా వెతికి పెడతారు. ఆపరేషన్ తర్వాత కొంతకాలంలోనే నీవు మామూలు మనిషివవుతావు." జాగ్రత్తగా మాటలు పేర్చుకొని తన పద్ధతిలో చెప్పాడు వివేక్.

"గుండె మార్పిడి, కిడ్నీ మార్పిడిలంత మాములు విషయం కాదు కదా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్. ఆపరేషన్ సక్సెస్ అవ్వడానికి ఎంత ఛాన్స్ ఉంది? తరువాత నా జీవితం ఎట్లా సాగుతుంది?" సూటిగా అడిగాడు ఆనంద్.

ఓ క్షణం మౌనంగా ఉండి పోయాడు వివేక్.

'నిజానికి ఆనంద్ పరిస్థితి చాలా తీవ్రంగా ఉందనీ, చేయి దాటిపోయిందనీ వివేక్ కు డాక్టర్ల మాటల ద్వారా తెలిసిపోయింది. లివర్ తో పాటు రోజురోజుకీ అతని శరీరంలోని మిగతా భాగాలు కూడా దెబ్బతింటున్నాయి. అట్లా జరగటం అరుదైనా అతని జబ్బు చాలా తక్కువ సమయంలో తీవ్ర రూపం దాల్చింది. ఆపరేషన్ చేయడం అనేది ఒక ప్రయత్నం మాత్రమే. అది ఎంతవరకు సక్సెస్ అవుతుందో తెలియదు. మళ్ళీ ఆ సమస్య ఎంతకాలం రాకుండా ఉంటుందో తెలియదు. తరువాత అతను మామూలు మనిషి ఎప్పుడవుతాడో ఎవరూ చెప్పలేరు. చాలా అనిశ్చిత పరిస్థితి.'

"ఆనంద్! నేను నీ దగ్గర నిజం దాచటం లేదు. ఏ ఆపరేషన్ అయినా రిస్క్ తో కూడుకున్న విషయమే. ఈ ఆపరేషన్ లో కూడా సక్సెస్ రేట్ అంతే. కాకపోతే ఖర్చు కొద్దిగా ఎక్కువ. తరువాత రికవర్ కావడానికి కొంతకాలం పట్టవచ్చు. తరువాత కూడా జాగ్రత్తగా మందులు వాడాలి. పూర్తిగా నార్మల్ లైఫ్ తిరిగి రాకపోయినా పెద్దగా సమస్యలేవీ ఉండకపోవచ్చు." అంతా కాకపోయినా కొంత కొంత చెప్పీ చెప్పక చెప్పాడు వివేక్.

"అంకిత చెప్పింది, ప్రస్తుతం అర్జెంటుగా 50 లక్షలు కావాలని. ఫ్లాట్, ఇండ్ల స్థలం అమ్ముదామంది..."

"అవన్నీ మేము చూస్తున్నాంగా. నీవెందుకు ఆలోచిస్తావు?" మెత్తగా కసిరాడు వివేక్, ఆనంద్ ను మధ్యలోనే ఆపు చేస్తూ. అతని కళ్ళల్లో స్నేహితుడిపై గల ప్రేమ ప్రతిబింబించింది.

మరుక్షణం గంభీరంగా మారింది ఆనంద్ ముఖం. "వివేక్! నేను చెప్పేది జాగ్రత్తగా విను. నాకున్న ఆస్తి అంతా తెగ నమ్మి, సక్సెస్ అవుతుందో కాదో అనుకునే ఆపరేషన్ చేయించుకుని, తరువాత మంచానికే పరిమితమైపోయి, జీవితమంతా మందుల మీద బ్రతికే బ్రతుకు నేను బ్రతకదలచుకోలేదు. డాక్టర్ని కాకపోయినా, నా ఆరోగ్య సమస్య నాకు అర్థమైంది. నా గురించే కాక అంకిత, మా ఇద్దరి పిల్లల గురించీ, వాళ్ళ భవిష్యత్తు గురించీ కూడా నేను ఆలోచించాలి. నేను ఎందుకూ పనికిరాని వాడిగా బ్రతికి ఉండటం కంటే, ఈ ఆపరేషన్ మాట ఎత్తకుండా ఆస్తి కాపాడగలిగితే వాళ్లకు మేలు చేసిన వాడినినవుతాను..."

ఆనంద్ ఆలోచన విన్న వివేక్ కు మిన్ను విరిగి మీద పడ్డట్లయింది. ఆనంద్ మాట పూర్తికాకముందే అతని నోరు మూశాడు వివేక్. "నీకేమైనా పిచ్చి పట్టిందా? అసలు నీకా ఆలోచన ఎందుకు వచ్చింది? మందులేని రోగమయితే ఎట్లాగూ ఏమీ చేయలేము. పరిష్కారం ఎదురుగా పెట్టుకుని డబ్బు కోసం చూసుకుంటామా?" కోపంగా అన్నాడు వివేక్.

ఒకసారి భారంగా నిట్టూర్చాడు ఆనంద్. "వివేక్! 'మనిషి ప్రాణం పోతే ఆ విచారం సమయం గడిచిన కొద్దీ తగ్గుతుంది. కానీ డబ్బు పోతే ఆ విచారం రోజు రోజుకీ పెరుగుతుంద'ని నానుడి. నేను చాలా ప్రాక్టికల్ మనిషినని నీకు బాగా తెలుసు. నేను బ్రతికి బయటపడ్డా, తరువాత ఎంత కాలం బ్రతుకుతానో, బ్రతికినన్నాళ్లు ఎంత శరీర బాధపడాలో తలుచుకుంటేనే భయంగా ఉంది. అందుకే నా నిర్ణయం చెప్తున్నాను. ఈ విషయంలో నాకు సహాయం చేయగలిగిన వాడివి నీవొక్కడివే..."

"అది కాదురా..." అంటూ అడ్డగించబోయిన వివేక్ ను వారించాడు ఆనంద్.

"నాయందు దయవుంచి ఫ్లాట్ అమ్మకానికి పెట్టకు. స్థలం అమ్మకం పడనీకు. అంకితకు అనుమానం రానీకు. అది నీ ఒక్కడి వల్లనే సాధ్యమవుతుంది. నేను చివరి దశలో ఉన్నానని నీకు తెలుసు. నా సమస్య రోజుల్లోనే పరిష్కరింపబడుతుందని నాకు అనిపిస్తున్నది. నేను చెప్పినట్టు చేయి." దృఢనిశ్చయం తో అన్నాడు ఆనంద్.

"ఇది చాలా అన్యాయం రా ఆనంద్. నీకు బాసటగా మేమందరం లేమా? నీవు కళ్ళెదురుగా ఉన్నదానికీ లేని దానికీ తేడా లేదా? మాకు నీ మీద ఉన్న ప్రేమ, నీతో ఉన్న అనుబంధం, నీ పట్ల మాకున్న ఎమోషన్స్ – వీటికేమీ విలువ లేదా? అంకితకు యీ విషయం తెలిస్తే ఎంత బాధపడుతుంది! నాకు తెలిసీ నేను చెప్పకపోతే నన్నెంత అసహ్యించుకుంటుంది! అసలు..."

వివేక్ మాటలు పూర్తికాకుండానే అతని చేతి మీద తన చేయి వేసి ఆపాడు ఆనంద్. "ప్రతి చిన్న విషయానికీ మనో నిబ్బరం కోల్పోతూ, ప్రేమ, ద్వేషం, విచారం లాంటి భావోద్వేగాలకు అతి త్వరగా గురయ్యే ఎమోషనలిజమ్ వల్ల ఏం లాభం చెప్పు! ఇప్పుడు అంకిత పడబోయే బాధ తాత్కాలికం. నా తరువాత తనూ, పిల్లలూ ఏ కష్టమూ లేకుండా బ్రతకడమే నాకు కావలసింది. విషయ సౌఖ్యాల గురించి పెద్దలు చెప్పిన 'సౌఖ్యంతు బిందు మాత్రేణ, దుఃఖం పర్వతమేవచ' అన్నది ఇక్కడ కూడా వర్తిస్తుంది." వేదాంత ధోరణిలో అన్నాడు ఆనంద్.

"ఎమోషనలిజమ్ పక్కన పెట్టు. కనీసం హ్యూమానిటేరియనిజమ్ గురించి ఆలోచించు. ఒక చిన్న పిచ్చుక పిల్ల గూటిలోంచి కింద పడితేనే 'అయ్యో పాపం!' అని మళ్లీ దాన్ని గూట్లో పెట్టి ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నిస్తామే! రోడ్డు మీద ఏ కుక్కపిల్లకో, కోతి పిల్లకో దెబ్బ తగిలితేనే బాధగా అనిపిస్తుందే! అటువంటిది, ఓ మనిషి ప్రాణం – అందునా నా ప్రియ మిత్రుడి ప్రాణం – పోతూ ఉంటే చూస్తూ ఊరుకోమంటావా? హ్యూమానిటేరియనిజమ్ ప్రకారమైనా మేము చేయవలసింది చేయకుండా ఎలా ఉంటాము?" నీళ్లు నిండిన కళ్ళతో అన్నాడు వివేక్.

"భూత దయ, కనికరం, జాలి లాంటి ఉద్వేగాలతో సతమతమయ్యే హ్యూమానిటేరియనిజమ్ కొంతవరకే పని చేస్తుంది. కాలు విరిగి నడవలేని గుర్రాన్ని కాల్చి చంపమా? చావు బ్రతుకుల్లో ఉన్న ఏ కుక్క పిల్లనైనా, ఏ కోతి పిల్లనైనా పూర్తిగా చంపటం ఆ జీవికి మేలు చేసినట్లే కదా! మెర్సీ కిల్లింగ్ ఇదే కదా! నేను మంచంలో ఉండి శరీర బాధ, మానసిక బాధ అనుభవిస్తుంటే అంకిత చూడగలుగుతుందంటావా, చెప్పు. నీకు మాత్రం ఈ విషయం తెలియదా?" గంభీరంగా అన్నాడు ఆనంద్.

"తెలుసు. కానీ ఏ పనైనా సాధించాలంటే ముందుగా మనకు కావలసింది ఆప్టిమిజమ్ అని నీకు తెలియదా? అది లేకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. నీ ఆరోగ్య విషయంలో మొదలే ఏవేవో ఊహించుకోవటం తప్పు కాదా?"

"ఓవర్ ఆప్టిమిజమ్ కూడా విపత్కర పరిస్థితులకు దారి తీస్తుంది కదా!"

"అవును, నిజమే. కానీ శత్రువైనా ప్రాణాపాయ పరిస్థితిలో ఉంటే కాపాడాలనే ఐడియలిజమ్ పాటించే జాతి మనది. అటువంటిది..."

"ఈ ఇజాలు వేరు, జీవితానుభవంలో మనకు గోచరించే నిజాలు వేరు, వివేక్!" అతన్ని మధ్యలోనే వారించాడు ఆనంద్. "ప్రతి మనిషీ ప్రప్రథమంగా కోరుకునేది తన సంతోషం, తన ఆనందం అన్నది పచ్చి నిజం. పైకి ఎవరితో ఎట్లా ఉన్నా మనలను అభిమానించే వాళ్ళను మాత్రమే మనమూ అభిమానిస్తామన్నదీ నిజం. మన మంచీ చెడూ చూసేవాళ్ళని మాత్రమే మనం ప్రేమిస్తామన్నదీ నిజం. ఎంత కష్టమైనా తను నమ్మిన సిద్ధాంతాలను పాటిస్తూ జీవించాలనుకునే ఐడియలిజమ్, అంతులేని ఆప్టిమిజమ్, అంతకు ముందు నీవు చెప్పిన హ్యూమానిటేరియనిజమ్, ఎమోషనలిజమ్ – ఈ ఇజాలన్నీ నేను చెప్పిన నిజాల ముందు దిగదుడుపే.

"ఇప్పుడు మనం తీసుకునే నిర్ణయాన్ని బట్టి 'భవిష్యత్తులో నా వాళ్ళ జీవితం ఎట్లా ఉంటుంది' అన్న విషయంలో నాకు స్పష్టమైన అవగాహన ఉంది. నేను తీసుకునే ఈ నిర్ణయానికి పూర్తి బాధ్యుడిని నేనే. అయితే ఎప్పటికైనా – కొన్నేళ్ల తర్వాతయినా – నా కుటుంబాన్ని చూసి నీవే అనుకుంటావు, ఇప్పుడు నేను చెప్పేది ఒప్పని. నాకా నమ్మకం ఉంది. కాబట్టి ఎక్కువగా ఆలోచించకుండా నాకీ సహాయం చేయి. ఇప్పుడు నీవు చెప్పిన ఇజాలన్నిటికీ ప్రభావితుడినై, నేను ఆస్తి అంతా అమ్మి ఆపరేషన్ కు సిద్ధం అయితే, భవిష్యత్తులో నా జీవితంలో ఎదురయ్యే చేదు నిజాల్ని నేను గానీ నా కుటుంబం గానీ ఎదుర్కోలేము. తరువాత రోజుల్లో వాళ్ళ ఆర్థిక దుస్థితికి నేనే కారణభూతుణ్ణి అన్న భావన నా భార్యా పిల్లల ముఖాల్లో నాకు ఒక్క క్షణం కనబడినా నాకు ఆత్మహత్యే శరణ్యం. మనం మనుషులం. నేను అనుకునే విధంగా జరిగే అవకాశాలు చాలా ఉన్నవని నీకు తెలుసు. అందుకే, నేను అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను." ఖరాఖండీగా చెప్పాడు ఆనంద్. అతని ముఖంలో విచారం కంటే ప్రశాంతతే కనిపించింది వివేక్ కు.

"నీవు ఎన్నో పుస్తకాలు చదివావు. 'చనిపోయే వాటిలో చిట్టచివరిది ఆశ' అని వినలేదా? కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచనా' అని భగవద్గీతలో చదవలేదా? ఫలితం గురించి ఆలోచించకుండా మన కర్తవ్యం మనం చేయాలి కదా!" మొండిగా చివరి ప్రయత్నం చేశాడు వివేక్.

"అవును భగవద్గీత అంతే చెప్పింది. అయితే 'జ్ఞానం లేకుండా కర్మ ఒకటే చేసే మనిషి అంధకార ప్రపంచంలోనే ఉండిపోతాడ'ని చెప్పింది అంతకంటే పురాతనమైన ఈశావ్యాసోపనిషత్తు. తెలుసు కదా!? మనం చేసే పని వల్ల జరిగే లాభనష్టాలు బేరీజు వేయడం వివేకం కాదా? అయినా 'జాతస్యహి ధ్రువం మృత్యుః' అన్నారు. మరణమంటే భయపడే భీరువులా కాకుండా 'సమదుఃఖ సుఖం ధీరం' అని భగవద్గీతలో చెప్పిన విధంగా ధీరువుగా ప్రవర్తించకపోతే ఇంత చదివీ, ఇంత తెలుసుకొనీ ప్రయోజనమేముంది?" అంతకంటే మొండిగా అన్నాడు ఆనంద్.

మరి నోట మాట రాక తనవైపు ఆర్తిగా చూస్తున్న వివేక్ చేతి మీద తన చేయి వేసి నిమురుతూ కొద్ది క్షణాలు ఊపిరి పీల్చుకున్నాడు ఆనంద్.

"నాతో మరి కొంతకాలం గడిపితే కలిగే సుఖం, నేను ప్రస్తుతం ఈ గండం నుంచి బయటపడితే కలిగే సంతోషం – ఈ తాత్కాలిక భావోద్వేగాల కంటే మిన్న అయిన చిరంతనమైన ఉద్వేగం – ఆనందం. ఆ ఆనందాన్ని మా వాళ్లకు కలిగించాలనే తపన పడుతున్నానురా వివేక్, నేను." భారంగా నిట్టూర్చాడు ఆనంద్.

అటు తరువాత వివేక్ ఎంత వాదించినా ఆనంద్ మనసు మారకపోవటంతో, వివేక్ కు ఆనంద్ చెప్పిన పని చేయక తప్పలేదు. హాస్పిటల్లో వివేక్ సన్నిహిత డాక్టర్ మిత్రులు కూడా ఆనంద్ విషయంలో కొన్ని అనుమానాలు వ్యక్తం చేయడం ఆనంద్ నిర్ణయాన్ని వివేక్ బలపరచడానికి దోహదం చేసింది.

'ఒక కుటుంబ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విషయంలో తను ఓ ప్రమాదకరమైన నిర్ణయం తీసుకుంటున్నాడు' అనే భయం, బాధ మనసులో ఉన్నా, ప్రియ మిత్రుడి కోరిక తీర్చడానికి ఆ బాధ్యత స్వీకరించాడు వివేక్.

తరువాత సంఘటనలన్నీ చాలా వేగంగా జరిగాయి. డబ్బు త్వరగా సమకూరకపోవడం వల్ల, డాక్టర్లు చెప్పిన సమయానికి ఆపరేషన్ చేయలేకపోవడం, అటు తరువాత వారం రోజుల్లోనే ఆనంద్ పోవటం, మరో వారానికి వివేక్ అమెరికా వెళ్లిపోవడం జరిగిపోయాయి. ..

ఆలోచనల్లోంచి బయటపడ్డాడు వివేక్. 'అవును, ఆనంద్ ఊహించింది నిజమే. వాడు పోయిన బాధ మనసులో ఉన్నా అంకిత, పిల్లలు ప్రస్తుతం బాగానే ఉన్నారు. వాళ్ళ జీవితాలకు ఏ విధమైన ధోకా లేదు. వాడు ఉండి ఉంటే, వాడి పరిస్థితీ, వాడిని చూస్తూ బాధపడుతూ వీళ్ళ పరిస్థితి ఎట్లా ఉండేదో! అటు శరీర బాధ, ఇటు ఆర్థిక ఇబ్బందులు – నరకం అనుభవించేవారు.'

తను చేసిన పని పూర్తిగా ఒప్పేనని నమ్మకం కలిగింది ఇప్పుడు వివేక్ కు.

"వివేక్! నీ పేరుకు తగ్గట్లు వివేకంతో నిర్ణయం తీసుకో! ఈ ఆనంద్ లేకపోయినా, జీవితంలో వాళ్లకు ఉండవలసిన ఆనందం ఉండేట్లు చెయ్యి" అని చివరగా ఆనంద్ చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనించగా దీర్ఘంగా నిట్టూర్చాడు వివేక్.

★★★★★★★★★★★★★★★

COMMENTS